క్లుప్తంగా

సైబర్ నేరాలపై అవగాహన



కాలనీవాసులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ఆయా కాలనీలలో సీఐ గంగాధర్, ఎస్ఐ దశరథ్‌ల ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైబర్ నేరాల విషయంలో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాట్సాప్‌కు వచ్చే సంబంధం లేని లింక్‌లను ఓపెన్ చేయొద్దన్నారు.

పనులను పూర్తి చేయండి



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి

జిన్నారం(పటాన్‌చెరు): మిషన్ భగీరథ పైప్ లైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి అధికారులకు సూచించారు. మున్సిపల్ పరిధిలోని ఆయా కాలనీల్లో చేపట్టిన పైప్‌లైన్ పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తయితే నీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలను పరిరక్షించాలి



చర్లగూడెంలో మొక్క నాటుతున్న మండల ప్రత్యేక అధికారి లలితాకుమారి

కంది (సంగారెడ్డి): మొక్కలను నాటి పరిరక్షించాలని మండల ప్రత్యేక అధికారి లలితాకుమారి అన్నారు. వనమహోత్సవంలో భాగంగా మండల పరిధిలోని కలివేముల, చెర్లగూడెం గ్రామాల్లో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా మురుగు కాలువలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి వందన, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



నోటుబుక్స్ పంపిణీ చేస్తున్న బ్యాంక్ మేనేజర్ నందు, సిబ్బంది

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): బ్యాంక్ ఆఫ్ బరోడా 117వ వ్యవస్థాపక దినోత్సవం వేడుకల్లో భాగంగా బ్యాంక్ ఆఫ్ బరోడా సదాశివపేట శాఖ ఆధ్వర్యంలో మండలంలోని నిజాంపూర్(కె) ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్కులు, స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ నందు మాట్లాడుతూ చదువుతోనే ఉజ్వల భవిషత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామకృష్ణ, అమ్మ ఆదర్శ పాఠశాలల చెర్‌పర్సన్ మీనా, ఉపాధ్యాయులు నవనీత, సునీత, బ్యాంక్ సిబ్బంది కిరణ్, నాగేష్, సీఆర్పీ నాగేష్ పాల్గొన్నారు.

పేకాట ఆడితే చర్యలు తప్పవు

కంగ్టి(నారాయణఖేడ్): పేకాట ఆడితే చర్యలు తప్పవని ఎస్ఐ విజయ్‌కుమార్ హెచ్చరించారు. కంగ్టి పోలీస్‌స్టేషన్‌లో జూదం, బెల్ట్ షాపులు, చోరీలు, గంజాయి మొక్కలు పెంపకం, వ్యాపారం చేయడం తదితర నేరాలపై అవగాహన మండల పరిధిలోని బాన్సువాడ గ్రామస్తులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా ఉండాలన్నారు. అనంతరం ఎస్ఐని గ్రామానికి చెందిన యువకులు ఘనంగా సన్మానించారు.

మూణ్నాళ్లకే పరిమితం

- అట్టహాసంగా బస్సు సర్వీసులు ప్రారంభం
- అంతలోనే ఆర్టీసీ సేవలు నిలిపివేత
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న అధికారులు, నైబర్‌హుడ్ అసోసియేషన్ సభ్యులు (ఫైల్)

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజా రవాణా వ్యవస్థ సరిగా లేకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో అనేక కాలనీలు వెలుస్తుండటంతో వేలాది మంది ప్రజలు ఇక్కడ నివాసం ఉంటున్నారు. కానీ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజా రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడంలో పాలకులు పూర్తి విఫలమవుతున్నారు. గతంలో రామచంద్రాపురం పట్టణంలోని లింగంపల్లి నుంచి తెల్లాపూర్, ఉస్మాన్‌నగర్ మీదుగా కొల్లూర్ వరకు ఆర్టీసీ బస్సు సర్వీసులు నడిచేవి. అవి కూడా ఉదయం, సాయంత్రం సమయంలో మాత్రమే బస్సుల సౌకర్యం ఉండేది. మిగతా సమయాల్లో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించేవారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ ఆధ్వర్యంలో ఇటీవల రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. దీంతో రెండు రోజుల్లోనే మంత్రి ఆదేశాలతో తెల్లాపూర్ మీదుగా కొల్లూర్ వరకు ఆర్టీసీ బస్సు సర్వీసుల సేవలను అట్టహాసంగా ప్రారంభించగా స్థానికులు కొత్త ప్రభుత్వంపై హర్షం వ్యక్తం చేశారు. కానీ.. ఆ సంతోషం మూడు న్నాళ్ల ముచ్చటకే పరిమితమైంది.

మళ్లీ.. మంత్రికి లేఖలు రాసిన సభ్యులు

కొద్ది రోజులుగా తిరిగి ఆర్టీసీ బస్సు సరిగా రావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై రెండు రోజుల క్రితం నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బస్సు విషయంపై మంత్రి పొన్నం ప్రభాకర్‌కు లేఖలు రాశారు. ఈ ప్రాంతంలో జనాభా సంఖ్య పెరగడం వల్ల రవాణా వ్యవస్థపై ఆర్టీసీ అధికారులు ఎందుకు దృష్టి పెట్టడం లేదని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తెల్లాపూర్ పరిధిలో రైల్వేస్టేషన్ ఉన్నా ప్రజలు ఎంఎంటీఎస్ రైలు ఎక్కలేని పరిస్థితి ఉందని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బస్సు సర్వీసులను పుణ ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇబ్బందులు తప్పడం లేదు



తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో 50కి పైగా కాలనీలు ఉన్నాయి. కానీ.. ఈ ప్రాంతంలో ప్రజా రవాణా వ్యవస్థ సరిగా లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. ఈ విషయాన్ని రవాణా శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లాం. దీంతో వెంటనే స్పందించి అధికారులను ఆదేశించగా బస్సు సర్వీసులను ప్రారంభించారు. ఆ తర్వాత కారణం ఏమిటో కాని బస్సు సర్వీసులు రావడం లేదు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలి.
– ఈశ్వరగారి రమణ, నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు

ఎంవీఐ సేవలు అందిస్తాం

- ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి



కల్హేర్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: నియోజకవర్గంలోని వాహనదారుల సౌలభ్యం కోసం వారానికి రెండు రోజులు నారాయణఖేడ్‌లోని రవాణా శాఖ క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసి స్థానికంగానే సేవలు అందిస్తామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నారాయణఖేడ్‌లో రవాణా శాఖ సేవలు అందుబాటులో లేకపోవడంతో డ్రైవింగ్ లైసెన్సులు, రెన్యూవల్, వాహన రిజిస్ట్రేషన్లు, ఫిట్‌నెస్ కోసం జహీరాబాద్‌కు వెళ్లాల్సి వస్తోందన్నారు. ఈ విషయంపై ఇటీవల రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి నారాయణఖేడ్‌లో సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కోరగా సానుకూలంగా స్పందిస్తూ వెంటనే రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్‌ను ఆదేశించారని గుర్తు చేశారు. వారంలోపు ఖేడ్‌లో ఎంవీఐ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. క్యాంపు కార్యాలయం ఏర్పాటుకు అవసరమైన స్థలాలను పరిశీలించామని తెలిపారు. సమావేశంలో సీడీఐ చైర్మన్ శాదుల్, మున్సిపల్ వైస్‌చైర్మన్ దారం శంకర్, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్ పాల్గొన్నారు.

ఠాణాల ఆధునీకరణకు చర్యలు

నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్ల ఆధునీకరణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. కంగ్టిలో పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించామన్నారు. కల్హేర్‌లోని గ్రంథాలయంలో కొనసాగుతున్న పోలీస్‌స్టేషన్‌కు నూతన భవనం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సిర్గాపూర్ పీఎస్ భవనానికి మరమ్మతులు చేయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని తెలిపారు. అదేవిధంగా నాగల్‌గిద్దలో పోలీస్‌స్టేషన్ నిర్మాణం, మోర్గి వద్ద గతంలో నిర్మించిన చెక్ పోస్టు భవనంలో తాత్కాలికంగా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేశారు. ఆయన వెంట సీడీసీ చైర్మన్ శాదుల్ల, మున్సిపల్ వైస్‌చైర్మన్ దారం శంకర్, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, సాయిలు, నారాయణ ఉన్నారు.

రుణమాఫీ చారిత్రాత్మకం

కల్హేర్(నారాయణఖేడ్): రైతుల రుణమాఫీ రుణమాఫీ చారిత్రాత్మకమని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. కల్హేర్, సిర్గాపూర్ మండల కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన రుణమాఫీ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ షాదుల్లా, ఏడీఏ నూతన్‌కుమార్, నాయకులు పోచయ్య, మనీష్ పాటిల్, కృష్ణమూర్తి, తుకరాం, దేవదాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి పరిశీలన

కల్హేర్‌లో ప్రభుత్వ ఆస్పత్రిని ఎమ్మెల్యే సంజీవరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరుశాతం పరిశీలించారు. ఆస్పత్రి సుపరింటెండెంట్ అనిల్‌రెడ్డి అందుబాటులో లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. డాక్టర్లు, సిబ్బంది సక్రమంగా విధులకు రావడంలేదని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సక్రమంగా విధులకు రాకుంటే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచయ్య, మాజీ పీఏసీఎస్ చైర్మన్ వీర్‌షెట్టి, నాయకులు దేవదాస్ తదితరులు ఉన్నారు.

రైతులకు పండగ రోజులొచ్చాయి

కంగ్టి(నారాయణఖేడ్): రైతురుణ మాఫీతో రైతులకు పండగ రోజులొచ్చాయని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. కంగ్టిలోని రైతువేదికలో నిర్వహించిన రైతు సంబురాల్లో ఆయన మాట్లాడుతూ ఏకకాలంలో రైతురుణాలు మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని తెలిపారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ షాదుల్లా, అధికారులు, రైతులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రుణమాఫీపై సర్వత్రా హర్షం



వట్‌పల్లి: అక్సాన్‌పల్లిలో...



నారాయణఖేడ్: అనంతసాగర్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

- సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం

నారాయణఖేడ్: రూ.2లక్షల రుణ మాఫీకి శ్రీకారం చుట్టి రూ.లక్షలోపు రుణాన్ని మాఫీ చేసినందుకుగాను హర్షం వ్యక్తం చేస్తూ మండల పరిధిలోని అనంతసాగర్, ర్యాకల్, మాద్వార తండా, తదితర గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రుణమాఫీ చేయడం చారిత్రాత్మకమని కొనియాడారు.

అందోలు మండల పరిధిలో...

వట్‌పల్లి(అందోల్): ప్రభుత్వం రూ.లక్ష లోపు రుణమాఫీ చేసినందుకుగాను అందోలు మండల పరిధిలోని అక్సాన్‌పల్లి గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు నర్సింహరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గాలింపు..

క్వారీలో గల్లంతైన వ్యక్తి

పటాన్‌చెరు టౌన్: క్వారీ నీటి గుంతలో పడిన ట్రాక్టర్ డ్రైవర్ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. శుక్రవారం గజఈతగాళ్లతో వెతికినా దొరక లేదు. రెండు రోజులు కావస్తున్నా తన భర్త ఆచూకీ లభించకపోవడంతో భార్య శ్రీలత, బంధువులు ఆందోళన చేశారు. క్వారీ యజమాని నిర్లక్ష్యం వల్లనే నర్సింలు క్వారీలో పడ్డాడని, కనీస భద్రతలు, నిబంధనలు పాటించకుండా ఈ ప్రమాదానికి కారణమైన క్వారీ యాజమాన్యం న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు, బీజేపీ నేతలు, గ్రామస్తులు ప్రధాన రహదారి పై బైఠాయించి ధర్నా చేశారు. ధర్నాలో కుటుంబీకులతోపాటు నేతలు కావలి వీరేశం, సంజీవ రెడ్డి, మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండల పరిధిలోని దోమడుగు గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు విద్యాసాగర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఆదిలక్ష్మి, కల్యాణి, షరీఫ్, మంగమ్మ, స్వప్న, విజయశ్రీని స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారి సేవలను తోటి ఉపాధ్యాయులు, నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గోవర్ధన్‌గౌడ్, బాలుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేతకీలో బీదర్ ఎంపీ పూజలు

ఝరాసంగం(జహీరాబాద్): కేతకీ సంగమేశ్వర ఆలయంలో కర్ణాటక రాష్ట్రం, బీదర్ ఎంపీ సాగర్ కండ్రే ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం కుటుంబ సభ్యులతో వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి



ఎడ్యుకేషన్ కిట్స్, ఆట వస్తువులను అందజేస్తున్న సభ్యులు

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ మధుసూదన్ అన్నారు. మండలంలోని పెద్దకంజర్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పార్కర్ హనీ ఫిన్ ఇండియా వారి సహకారంతో మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ వారు ఎడ్యుకేషన్ కిట్స్, ఆట వస్తువులను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజ్‌కుమార్, ఉపసర్పంచ్ శంకర్‌గౌడ్, మెడ్వాన్ సిబ్బంది పాల్గొన్నారు.

కళాకారులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న నాగభూషణం

జహీరాబాద్ టౌన్: వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న కళాకారులను ఆదుకోవాలని ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగభూషణం ప్రభుత్వాన్ని కోరారు. ప్రజా నాట్యమండలి మండల నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారులు స్వాతంత్రోద్యమం నుంచి నేటి వరకు పాలకుల వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలను చైతన్య పరుస్తున్నారని తెలిపారు. తెలంగాణ సాయుధ రైతాంగా పోరాటంలో ప్రజల పక్షాన ప్రజానాట్యమండలి అండగా నిలిచిందన్నారు. కళాకారులను ఐక్యం చేసి వారి సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తామని తెలిపారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాణిక్యం, ఉపాధ్యక్షుడిగా రాజు, ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా అంజయ్య, సహాయ కార్యదర్శులుగా వెంకటయ్య, రాములు, సభ్యులుగా లక్ష్మయ్య, యశ్వంత్, అనిల్‌కుమార్, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, దుర్గప్రసాద్, రవి, శ్రీకాంత్ ఎన్నుకున్నారు.

గాలివానకు కూలిన చెట్లు



ఆదర్శనగర్ కాలనీలో నేలకొరిగిన చెట్టు

- కరెంట్ సరఫరాకు అంతరాయం
- తెగిపడిన విద్యుత్ తీగలు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో గురువారం కురిసిన వర్షానికి చెట్లు నేలకూలగా విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. పెద్ద వృక్షాలు నేలకొరగడంతో రాకపోకలకు కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కరెంట్ సరఫరా నిలిచిపోవడంతో కాలనీవాసులు శుక్రవారం తెల్లవారుజాము వరకు అవస్థలు పడ్డారు. చెట్లు కూలి కరెంట్ తీగలు తెగిపడ్డ విషయమై కాలనీ ప్రజలు ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేయగా సిబ్బంది చెట్లను తొలగించి తెగిన తీగలు సవరించారు.

గుంతలమయంగా రోడ్డు



దెబ్బతిన్న గాంధీనగర్-చిన్న హైదరాబాద్ రోడ్డు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని గాంధీనగర్, చిన్న హైదరాబాద్‌ల మధ్య ఉన్న రోడ్డు దెబ్బతిని గుంతలమయంగా తయారైంది. అధిక లోడ్ కల్గిన వాహనాలు రాకపోకలు సాగించడం ద్వారా పెద్దపెద్ద గుంతలు పడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణంలో జరుగుతున్న జాప్యం కారణంగా రోడ్డు ఈ దుస్థితి వచ్చిందని ప్రజలు వాపోతున్నారు. పట్టణ సమీపంలో నిర్మిస్తున్న రైల్వే అండర్ బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో మొగుడంపల్లి వైపు వెళ్లే వెహికల్స్ గాంధీనగర్-చిన్న హైదరాబాద్ మీదుగా మళ్లించి రాకపోకలు సాగిస్తున్నారు. లారీలు, కంటైనర్లు, స్కూల్ బస్సులు ఇదే రూట్ గుండా వెళ్లడంతో రోడ్డు గుంతలు పడింది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **కొనసాగుతున్న కార్మికుల ఆందోళన**



జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని వివిన్ డ్రగ్స్ పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు చేపట్టిన ఆందోళనలు శుక్రవారంతో రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఎనిమిది నెలలు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పారిశ్రామికవాడలో ర్యాలీ నిర్వహించారు.

◆ **ముగిసిన మొహర్రం ఉత్సవాలు**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని టేకూర్ గ్రామంలో రెండు రోజులుగా కొనసాగిన మొహర్రం ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. రెండవ రోజు ఆయా గ్రామాలకు చెందిన భక్తులు దూది పీర్లతో తరలివచ్చి మైబుసుభానీ దర్గాను దర్శించుకున్నారు. అనంతరం గ్రామంలో ఆశుర్కాన వద్ద పీర్లను ప్రతిష్ఠించి రుమాళ్ల ఆట ఆడారు.

◆ **విద్యుదాఘాతంతో ఎద్దు మృతి**

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని రాయిపాడ్ గ్రామంలోని జంగం బసమ్మకు చెందిన ఎద్దు మేత మేస్తున్న క్రమంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలింది. దీంతో విద్యుత్ ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితులు వేడుకున్నారు.

◆ **చెరువు అభివృద్ధికి కృషి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని రాయసముద్రం చెరువు అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్ప అన్నారు. పట్టణంలోని రాయసముద్రం చెరువు వద్ద పిచ్చిమొక్కల తొలగింపు పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

◆ **ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు**

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని పెద్దారెడ్డిపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 5ఎంవీ అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం బిగించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పెద్దారెడ్డిపేట, రాయిపాడ్, మంతూర్ గ్రామాలలో విద్యుత్ సమస్య తీరుతుందని తెలిపారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాస్, ఏడీఈ శ్రీనివాస్, ఏఈ ప్రసాద్ పాల్గొన్నారు.

◆ **పత్తి సాగులో మెలకువలు పాటించాలి**

కల్హేర్(నారాయణఖేడ్): పత్తి సాగు, కలుపు నివారణ పనుల్లో మెలకువలు పాటించాలని జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ అధికారిణి అంబికసోని అన్నారు. శుక్రవారం నిజాంపేట్ మండలం మునిగేపల్లిలో పత్తి సాగును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పత్తి సాగు విధానంపై అవగాహన కల్పించారు. ఆమె వెంట ఏఈఓ కృష్ణవేణి పాల్గొన్నారు.

◆ **ఎల్‌ఓసీ అందజేత**

జహీరాబాద్: మొగుడంపల్లి మండలంలోని మన్నాపూర్ గ్రామానికి చెందిన రవికుమార్‌కు గుండె ఆపరేషన్ నిమిత్తం రూ.2.50లక్షల ఎల్‌ఓసీని సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుండ్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ముబీన్, నర్సింహారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, శివశంకర్, గుండన్న, శంకర్ పాల్గొన్నారు.

◆ **కంకోల్‌లో వనమహోత్సవం ప్రారంభం**

మునిపల్లి(అందోల్: మండలంలోని కంకోల్ గ్రామంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని మండల ప్రత్యేకాధికారి రమాచారి ప్రారంభించారు. ఈ సందర్భంగా కంకోల్ రెవెన్యూ ప్లాంటేషన్‌లో వివిధ రకాల మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరినంధన్‌రావు, ఎపీఓ యదగిరి, సంతోష్, మహబూబ్, పంచాయతీ కార్యదర్శి అర్చన పాల్గొన్నారు.

◆ **గురుపౌర్ణమి బ్రహ్మోత్సవాలు ప్రారంభం**

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని మాధుర గ్రామ శివారులోని దత్తాత్రేయ క్షేత్రంలో గురు పౌర్ణమి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం దత్తాత్రేయస్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, చండీ హోమం, గణపతి హోమం నిర్వహించినట్లు క్షేత్రాధిపతి సభాపతిశర్మ తెలిపారు.

◆ **గుంతల పూడ్చివేతకు చర్యలు**

నారాయణఖేడ్: పట్టణంలోని గాంధీచౌక్ నుంచి మంగల్‌పేట్ హనుమాన్ ఆలయం వరకు ఉన్న బైపాస్ రహదారిపై ఏర్పడిన గుంతలను మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా దారం శంకర్ మాట్లాడుతూ శనివారం నుంచి మరమ్మతులు చేపడతామని తెలిపారు. ఆయన వెంట కౌన్సిలర్లు రాజేష్ చౌహాన్, హన్మండ్లు, శానిటరీ అధికారి శ్రీనివాస్ ఉన్నారు.

◆ **పాఠశాలలో బోనాల ఉత్సవాలు**



నారాయణఖేడ్: పట్టణంలోని నియో ప్రగతి ఉన్నత పాఠశాలలో బోనాల వేడుకలను శుక్రవారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి సతీమణి అనుపమారెడ్డి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ ప్రకాష్, కరస్పాండెంట్ వెంకటరత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **ప్రభుత్వం మాట తప్పింది**

సంగారెడ్డి: ప్రభుత్వం ఒకే విడతలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి లక్ష రూపాయలే మాఫీ చేసి మాట తప్పిందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరావు కులకర్ణి శుక్రవారం వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. ఆదరాబాదరాగా లబ్ధిదారులను ప్రకటించిన ప్రభుత్వం అర్హులందరికీ రుణమాఫీ అందించలేకపోయిందని ఆరోపించారు.

◆ **సీజనల్ వ్యాధులపై అవగాహన**

జోగిపేట(అందోల్): ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపల్ వార్డు ఆఫీసర్, కౌన్సిలర్ చిట్టిబాబు ఆధ్వర్యంలో అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలో 17వ వార్డులో శుక్రవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

◆ **అబ్దుల్ రహీంకు పరామర్శ**

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండలం ఏస్గి గ్రామానికి చెందిన జాతీయ మానవహక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ రహీంతో పాటు అతడి సోదరుడు తయబ్‌పై గ్రామంలో కొందరు దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డారు. కాగా ఖేడ్ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న వీరిని శుక్రవారం డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు శంకర్ ముదిరాజ్, పలు ప్రజా సంఘాల నాయకులు బాధితులను పరామర్శించారు.